నెల్లూరు పురపోరులో స్పీడు పెంచిన సైకిల్!



04



RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక



అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090

8374168090



నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -29 | గురువారం 29 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-






## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సేవా కార్యక్రమాలు

- 500 యూనిట్ల రక్తం సేకరణ.. పోలీసులకు ఉచిత మెగా వైద్య శిబిరం
- పోలీసు సిబ్బందితో 10 కి.మీ. మారథాన్.. ఏక్తా దివస్ ప్రతిజ్ఞ

**నెల్లూరు,(అక్షర దర్శిని):** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఐపీఎస్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరం, 10 కిలోమీటర్ల మారథాన్ రన్, ఏక్తా దివస్ జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ కార్యక్రమాలను చేపట్టారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఆటో డ్రైవర్లు, కళాశాల విద్యార్థులను అభినందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొంటూ, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో అందించి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు ఆత్మకూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఇతర సబ్‌డివిజన్ల పరిధిలో నిర్వహించిన శిబిరాల ద్వారా సుమారు 500 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కిమ్స్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. విధి నిర్వహణలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిచ్చే పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వైద్య పరీక్షలు, తగిన విశ్రాంతితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. పోలీసుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించే లక్ష్యంతో 10 కిలో మీటర్ల మారథాన్ రన్ నిర్వహించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అడిషనల్


మిగతా 2 లో.......








## తుఫాన్ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ఆర్టీజీఎస్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- రహదారులపై చెట్లు పడితే వెంటనే తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశం

**అమరావతి,(అక్షర దర్శిని):** తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పరిస్థితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయానికి చేరుకున్న ఆయన ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పరిశీలించారు. తుఫాన్ గమనం, ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాన్ కారణంగా వివిధ ప్రాంతాల్లో చెట్లు కూలిపడటంతో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారులపై చెట్లు విరిగిపడితే వెంటనే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికలు వెలువడినప్పటి నుంచి ఆర్టీజీఎస్ కేంద్రం ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. మనమిత్ర యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేయడంతో పాటు సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు



సీఎంకు వివరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

## మెట్టను మాగాణిగా మార్చిన ఘనత నాదే!

- పొదలకూరు మండలానికి నేను చేసినంత అభివృద్ధి ఎవరూ చేయలేదు
- దక్షిణ కాలువతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపాం
- అభివృద్ధి కొనసాగాలంటే సైకిల్ గుర్తుకు ఓటేయండి
- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**పొదలకూరు,(అక్షర దర్శిని)** : పొదలకూరు మండలానికి తాను చేసినంత అభివృద్ధి మరెవరూ చేయలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దక్షిణ కాలువను తీసుకొచ్చి మెట్ట భూములను మాగాణిగా మార్చిన ఘనత తనదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పొదలకూరు మండలంలోని తాటిపర్తి, నల్లబాలెం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, తాటిపర్తి బిట్-1 ఎంపీటీసీ అభ్యర్థి కసిరెడ్డి పుష్పవేణి, బిట్-2 అభ్యర్థి పల్లవరపు కృష్ణయాదవ్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాటిపర్తి ప్రజలు టీడీపీకి భారీ మెజార్టీ ఇచ్చి తనను గెలిపించారని గుర్తుచేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు సాగునీటి కోసం ఇబ్బందులు పడిన మెట్ట ప్రాంత రైతులకు దక్షిణ కాలువ ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. పొదలకూరు మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేశానని చెప్పారు.





**అభివృద్ధికి అండగా నిలవండి** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సోమిరెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని


మిగతా 3 లో.......




## పోస్టల్ బ్యాలెట్‌లోనూ అక్రమాలు జరిగాయంటూ కాకాణి ఫిర్యాదు

- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- అక్రమాలపై సాక్ష్యాధారాలతో కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోస్టల్


మిగతా 4 లో.......

# అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు!







- ఎమ్మార్వో కాలనీలో జోరుగా ఎన్నికల ప్రచారం
- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి
- జగనన్న, కాకాణికి విజయాన్ని కానుకగా ఇద్దాం: బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి(చిన్ని)

**పొదలకూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విజయాన్ని కానుకగా అందించాలని పొదలకూరు జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి (చిన్ని) ప్రజలను కోరారు. బుధవారం పొదలకూరులోని ఎమ్మార్వో కాలనీలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు పొదలకూరు బిట్–1 ఎంపీటీసీ అభ్యర్థి గంగవరపు లక్ష్మీకళ్యాణి, బిట్–2 అభ్యర్థి వాకాటి సంధ్య, బిట్–3 అభ్యర్థి కోవూరు వెంకటేశ్వర్లు కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరులో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చినట్లు తెలిపారు. గతంలో నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉన్న వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించామని, వర్షాకాలంలో మురుగునీరు, వరద నీటి సమస్యలను పరిష్కరించేందుకు సైడ్ కాలువలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు గత ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

**కాకాణి నాయకత్వంలో సర్వేపల్లి అభివృద్ధి** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. పొదలకూరు జడ్పీటీసీ అభ్యర్థిగా తనను, ఎంపీటీసీ అభ్యర్థులుగా గంగవరపు లక్ష్మీకళ్యాణి, వాకాటి సంధ్య, కోవూరు వెంకటేశ్వర్లును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అభ్యర్థులు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు





**పొదలకూరు,(అక్షర దర్శిని) :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులోని శ్రీ వినాయక, కామాక్షి తాయి రామలింగేశ్వర దేవస్థానంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కుమార్ స్వామి అయ్యప్ప స్వామితో పాటు వినాయకుడు, శివయ్య, కామాక్షమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం షేక్ సుల్తాన్ (పిటిడి) కానిస్టేబుల్ అయ్యప్ప స్వాములకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు ఆయనను కండువాతో సత్కరించి, పూలమాలతో అభినందించారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గురుస్వామి, శివాడ పరంధామి రెడ్డి, బ్రహ్మదేవి రాజశేఖర్, గోళ్ళ రమణయ్యతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సేవా కార్యక్రమాలు

మొదటి పేజీ తరువాయి



ఎస్పీ (అడ్మిన్) సీహెచ్. సౌజన్య, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) పి.వి. అప్పారావు మారథాన్‌ను ప్రారంభించారు. పరేడ్ గ్రౌండ్ నుంచి కరెంట్ ఆఫీస్ వైపు వెళ్లి తిరిగి పరేడ్ గ్రౌండ్‌కు చేరుకునేలా రన్ సాగింది. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటే పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని అధికారులు సూచించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏక్తా దివస్ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సీహెచ్. సౌజన్య పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంతో పాటు ప్రజల్లో సోదరభావం, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమాల్లో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, కిమ్స్ వైద్య బృందం, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వైద్య సేవలందించిన నిపుణులకు, సాంకేతిక సిబ్బందికి, రక్తదాన శిబిరం నిర్వహణలో సహకరించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మెట్టను మాగాణిగా మార్చిన ఘనత నాదే!

మొదటి పేజీ తరువాయి

హామీ ఇచ్చారు. పొదలకూరు మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకునేలా ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థులు కసిరెడ్డి పుష్పవేణి, పల్లవరపు కృష్ణయాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు వేసే ప్రతి ఓటు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ప్రజల ఆశీస్సులతో స్థానిక సంస్థల్లో టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# యువతలో నాయకత్వ పటిమ పెంపొందించడమే లక్ష్యం

- ఈ నెల 31న నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో వికసిత భారత్ యూత్ పార్లమెంట్
- 'వన్ నేషన్ -- వన్ ఎలక్షన్'పై యువత చర్చలు





**నెల్లూరు,(అక్షర దర్శిని) :** యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు పార్లమెంటరీ విధానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో మేరా యువ భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వికసిత భారత్ యూత్ పార్లమెంట్' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్‌తో కలిసి జిల్లా యువజన అధికారి శశికాంత్ రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ, యువతలో నాయకత్వ పటిమను పెంపొందించేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, సమకాలీన అంశాలపై విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు అక్టోబర్ 31న నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా 'వన్ నేషన్ -- వన్ ఎలక్షన్' (ఒకే దేశం -- ఒకే ఎన్నిక) అంశంపై యువత తమ అభిప్రాయాలను, విశ్లేషణలను వెల్లడించనున్నట్లు వివరించారు. దేశ సమగ్ర అభివృద్ధికి, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి దోహదపడే ఇటువంటి కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. నెల్లూరు జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు, యువకులు, మేరా యువ భారత్ వాలంటీర్లు అధిక సంఖ్యలో హాజరై యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కాకాణి ఆశీస్సులతో జనంలోకి వాకాటి సంధ్య





- పొదలకూరు బిట్--2లో ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమమే మా విజయానికి బాటలు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటాం: వాకాటి సంధ్య

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో పొదలకూరు బిట్--2 ఎంపీటీసీ అభ్యర్థి వాకాటి సంధ్య ప్రజల్లోకి వెళ్తూ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా వాకాటి సంధ్య మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేశారని తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా గత ప్రభుత్వం పనిచేసిందన్నారు.

**కాకాణి నాయకత్వమే మా బలం** సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వం తమకు బలమని వాకాటి సంధ్య పేర్కొన్నారు. ఆయన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు అనుకూలంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజల్లోకి వెళ్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు.

**పొదలకూరు మండలంలో వైఎస్సార్‌సీపీదే విజయం** రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పొదలకూరు మండలంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సంధ్య తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుని పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా** పొదలకూరు బిట్--2 ఓటర్లు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వాకాటి సంధ్య విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో బిట్--2 అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విజయాన్ని కానుకగా అందించాలని ప్రజలను కోరారు.

# అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా





- కూటమి అభ్యర్థుల గెలుపుతో స్థానిక సంస్థలకు మహర్దశ
- 2024 ఎన్నికల మెజార్టీని మించి ఆదరించండి: ఎమ్మెల్యే సోమిరెడ్డి

**తోటపల్లిగూడూరు,(అక్షర దర్శిని) :** అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత బాటలు పడతాయని అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తనకు లభించిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో అందించాలని ప్రజలను కోరారు. బుధవారం తోటపల్లిగూడూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా మాట్లాడారు. తోటపల్లిగూడూరు తన సొంత మండలమని, తన బంధువర్గం అంతా ఇక్కడే ఉందని సోమిరెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, అరాచకాలు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వ భూములతో పాటు దళితులు, గిరిజనుల భూములు, పాఠశాలలు, ఆలయాలకు సంబంధించిన భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉండి భూదోపిడీకి పాల్పడిన వారు ప్రస్తుతం తమపై విమర్శలు చేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. అలాంటి వారికి ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

**పేదలకు భూయాజమాన్య హక్కులు కల్పించాం** గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలో 70 వేల ఎకరాలకు పైగా సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీ పట్టాలుగా మార్చి పేదలకు అందించామని సోమిరెడ్డి వివరించారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. పట్టాల ద్వారా రైతులకు భూములపై హక్కులు లభించడంతో పాటు వాటి విలువ పెరిగి పేద కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 7 వేల ఎకరాలకు సంబంధించి డీకేటీ పట్టాలు అందించామని, తోటపల్లిగూడూరు మండలంలో 1,077 మంది రైతులకు 761 ఎకరాలకు పట్టాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. పేదలకు మేలు చేసేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, వైసీపీ పాలనలో పలు ప్రాంతాల్లో దళితులు, గిరిజనులకు చెందిన భూములతో పాటు పాఠశాల భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఆలోచించి ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు.

**కూటమి ప్రభుత్వంతో సంక్షేమ పథకాలు** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని సోమిరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందించే నిధులను స్థానిక సంస్థలకే పూర్తిస్థాయిలో వినియోగించేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాచరణ చేపడుతున్నారని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సమష్టి కృషితో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, స్థానిక సంస్థల బలోపేతానికి కూటమి అభ్యర్థుల గెలుపు దోహదపడుతుందని చెప్పారు.

**అవినీతికి ఓటుతో సమాధానం చెప్పాలి** వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి శాఖలో పనులు పూర్తికాకుండానే భారీ మొత్తంలో బిల్లులు చెల్లించారని, కాలువలు, చెరువులకు షట్టర్లు ఏర్పాటు చేయకుండానే రూ.7 కోట్లకు పైగా బిల్లులు పొందారని సోమిరెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు పరిశీలన జరపాలని పేర్కొంటూ, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెప్పాలని కోరారు.

**కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం** తోటపల్లిగూడూరు మండలంలో జెడ్పీటీసీ అభ్యర్థి జానా రజని, వరిగొండ ఎంపీటీసీ అభ్యర్థులు పేరం శోభారాణి, జానా జగదీష్, తోటపల్లిగూడూరు అభ్యర్థి మన్నెం విమల, పోట్లపూడి--విలుకానిపల్లి అభ్యర్థి గల్లా ప్రవల్లిక, పాపిరెడ్డిపాళెం--ఇస్కపాళెం అభ్యర్థి ఇంగిలాల నిర్మలమ్మను గెలిపించాలని సోమిరెడ్డి ఆయా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం విఫలం

- అధికార పార్టీకి అధికారులు వత్తాసు పలకడం దారుణం
- నెల్లూరు జడ్పీ అభ్యర్థుల జాబితా ప్రకటనలో జాప్యమెందుకు?
- ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు ఉపసంహరింపజేసేందుకు కుట్ర
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వెంకటాచలం మండలం పుంజులూరుపాడు, తోటపల్లిగూడూరు మండలం సౌత్ ఆమలూరు గ్రామాల్లో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో జడ్పీటీసీ అభ్యర్థుల తుది జాబితాలు ప్రకటించినా నెల్లూరు జిల్లాలో మాత్రం జాప్యం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినా జాబితా ప్రకటించకపోవడం వెనుక అధికార పార్టీ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 79 ఎంపీటీసీ, ఐదు జడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బరిలో నిలిపామని తెలిపారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే అత్యధిక స్థానాల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారులు ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, ప్రతిపక్ష అభ్యర్థులను వేధించడం మానుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

# ఎన్నికల వ్యయ వివరాలను పక్కాగా నిర్వహించాలి

- అభ్యర్థుల ఖర్చులపై నిఘా ఉంచాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు వి. సాయిబాబు సూచన



నెల్లూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ వివరాలను నిబంధనల ప్రకారం పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వి. సాయిబాబు అధికారులకు సూచించారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నివేదికలను నిర్దేశిత సమయంలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించి అధికారులు సమర్పించాల్సిన నివేదికలు, అభ్యర్థులు అందజేయాల్సిన ఖర్చుల వివరాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిబంధనలకు అనుగుణంగా నమోదు చేయాలని, వివరాల నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలను సక్రమంగా పరిశీలించి, నిర్ణీత గడువులో నివేదికలు సమర్పించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ మధుసూదన్, డిప్యూటీ సీఈఓ బ్రహ్మయ్య, జిల్లా సహకార అధికారి బి. గురప్ప, జిల్లా ఆడిట్ అధికారి డి. సింహాద్రి, నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

నెల్లూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు సదా భార్గవి అధికారులను ఆదేశించారు. ఓటర్లందరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.బుధవారం నెల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 31/3, 31/4, 31/5, 32/3 నంబర్లు గల పోలింగ్ కేంద్రాలను సదా భార్గవి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను సమీక్షించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.పోలింగ్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.



# రాపూరు బీజేపీలో అసమ్మతి సెగ

- పార్టీ పదవులకు ముగ్గురు మండల నాయకుల రాజీనామా
- 8 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేసినా బీఫాంలు అందలేదని అసంతృప్తి

**రాపూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల వేళ నెల్లూరు జిల్లా రాపూరు మండల భారతీయ జనతా పార్టీలో అసంతృప్తి వ్యక్తమైంది. మండలంలోని ఎనిమిది ఎంపీటీసీ స్థానాలకు బీజేపీ తరఫున నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, పార్టీ అధిష్ఠానం నుంచి బీఫాంలు అందకపోవడంతో పలువురు మండల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ బలోపేతం కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న తమకు తగిన గుర్తింపు లభించడం లేదని నాయకులు వాపోయారు. పార్టీపై నమ్మకంతో పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఎంత శ్రమించినా తమకు తగిన విలువ దక్కడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాపూరు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి మనుబోలు శివప్రసాద్, పార్టీ ఉపాధ్యక్షుడు కరిపం బాలసుబ్రమణ్యం, పార్టీ కార్యదర్శి ఇండ్ల రాజశేఖర్ తమ పదవులకు రాజీనామా చేసినట్లు ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మండల స్థాయి నాయకులు రాజీనామా చేయడం రాపూరు బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం పార్టీ స్థానిక నాయకత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

# రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి

- అగ్రిస్టాక్ అమలుపై జిల్లా కలెక్టర్ సమీక్ష
- పంటల వారీగా డిజిటల్ సమాచారం సేకరించి.. మార్కెట్‌తో రైతులను అనుసంధానించాలి





**నెల్లూరు,(అక్షర దర్శిని) :** రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు అవకాశాలను పెంపొందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో అగ్రిస్టాక్ కార్యక్రమం అమలు, డిజిటల్ వ్యవసాయ సమాచార సమీకరణ, రైతులకు మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు అగ్రిస్టాక్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, అమలు విధానం, వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయానికి సంబంధించిన వివిధ శాఖల సమాచారాన్ని సమన్వయం చేయడం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు.

**పంటల వారీగా సమగ్ర సమాచారం** జిల్లాలో ప్రాంతాల వారీగా, రైతుల వారీగా, పంటల వారీగా సమగ్ర వ్యవసాయ సమాచారాన్ని రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమాచారాన్ని ఉపయోగించుకుని వ్యవస్థీకృత రిటైలర్లతో రైతులను అనుసంధానించాలని పేర్కొన్నారు. తద్వారా రైతులు పండించిన ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందని తెలిపారు. జిల్లాలో ప్రధానంగా సాగు చేస్తున్న పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, వేరుశనగ తదితర వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెట్ అనుసంధానం వంటి అవకాశాలను గుర్తించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

**అంతరశాఖల సమన్వయంతో రైతులకు ప్రయోజనాలు** అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను గుర్తించి, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమర్థంగా వినియోగిస్తూ ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు.డిజిటల్ వ్యవసాయ సమాచారం ద్వారా పంటల ప్రణాళికను మెరుగుపరచడం, పంటల ఆధారంగా మార్కెటింగ్ అవకాశాలను గుర్తించడం, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం, రైతులకు మెరుగైన సేవలు అందించడం వంటి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు.సమావేశంలో వ్యవసాయ సమాచార నాణ్యత, భూముల వివరాల అనుసంధానం, రైతుల గుర్తింపు, ప్రభుత్వ పథకాల అమలు, పంటల ప్రణాళిక, పంటల పర్యవేక్షణ, పంటల బీమా, వ్యవసాయ మార్కెటింగ్, రుణాలు, వ్యవసాయ గణాంకాలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా స్థాయి సమావేశం అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, ముఖ్య ప్రణాళిక అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఐటీడీఏ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, డీడీఏ, డీఆర్‌సీ వి. సుమలత, వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. వినీత, సహాయ వ్యవసాయ సంచాలకులు డి. సుజాతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నెల్లూరు పురపోరులో స్పీడు పెంచిన సైకిల్!

- రోజుకు పది డివిజన్లలో మంత్రి కుటుంబం ప్రచార హోరు
- 69, 9, 23 డివిజన్లలో బీదా మస్తాన్‌రావుతో కలిసి నారాయణ రోడ్‌షోలు
- అభివృద్ధే కూటమి బలం.. గెలుపుపై ధీమా

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో కూటమి దూకుడు పెంచింది. రోజుకు సుమారు పది డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తూ మంత్రి పొంగూరు నారాయణ కుటుంబం ఎన్నికల హోరును పెంచుతోంది. బుధవారం 69, 9, 23 డివిజన్లలో రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావుతో కలిసి మంత్రి నారాయణ రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రచారానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని కూటమి నాయకులు తెలిపారు. 69వ డివిజన్ అభ్యర్థి షేక్ షాహీనా, 9వ డివిజన్ అభ్యర్థి తాళ్లూరి శశికుమార్, 23వ డివిజన్ అభ్యర్థి కాయల తిరుపతితో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మంత్రి నారాయణ ఓటర్లను కోరారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**వైసీపీ ఆరోపణల్లో పసలేదు** వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం పస లేదని మంత్రి నారాయణ విమర్శించారు. ఓటమి తప్పదనే భయంతోనే తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యర్థులపై విమర్శలు చేయడం, హింసకు పాల్పడటం వైసీపీ నేతల నైజమని వ్యాఖ్యానించారు. తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు కోరుతున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని, అన్ని డివిజన్లలోనూ కూటమికి అనుకూల వాతావరణం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు.

**అభివృద్ధే కూటమి బలం** రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ.. మంత్రి నారాయణ నెల్లూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలు, పార్కుల రూపురేఖలను మారుస్తూ, సుందరీకరణ పనులతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ నెల్లూరు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నగరానికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని, భారీ మెజారిటీ సాధించడమే లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ బరిలో నిలిపిన అభ్యర్థులకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని, మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్ లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోస్టల్ బ్యాలెట్‌లోనూ అక్రమాలు జరిగాయంటూ కాకాణి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

బ్యాలెట్ ప్రక్రియలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఆనం కార్తీక్‌రెడ్డితో కలిసి కాకాణి బుధవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పలు అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన కొందరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రహస్యంగా జరగాల్సిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని ఆరోపించారు.

**వీడియో ఆధారాలను కలెక్టర్‌కు అందించాం** నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి జరిగిన పరిణామాలను వీడియో రూపంలో చిత్రీకరించామని కాకాణి తెలిపారు. ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఆనం కార్తీక్‌రెడ్డితో దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఆ వీడియోలను జిల్లా కలెక్టర్‌కు చూపించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల నుంచి ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల నిబంధనలను అమలు చేయాలని సూచించారు.

**కోర్టును ఆశ్రయిస్తాం** పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అవసరమైతే సాక్ష్యాధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కాకాణి స్పష్టం చేశారు. ఫిర్యాదుపై అధికారులు స్పందించి, జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై స్పందించకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున న్యాయపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



# అభివృద్ధి చేశాం.. ఆదరించి గెలిపించండి!



- కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
- జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి
- సైకిల్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి అండగా నిలవాలి
- టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి
- పొదలకూరులో ముమ్మరంగా టీడీపీ ఎన్నికల ప్రచారం

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** అభివృద్ధి చేశాం.. మరింత అభివృద్ధి చేసేందుకు ఆదరించి గెలిపించాలని టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పొదలకూరులోని టీపీ నగర్, కాకుమాని లేఅవుట్, శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, బిట్-1 ఎంపీటీసీ అభ్యర్థి ఆదాల సుగుణ, బిట్-3 అభ్యర్థి ఖాదర్‌బాషా ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గతంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి టీడీపీకి అండగా నిలవాలని కోరారు.

**స్థానిక సంస్థల్లోనూ సైకిల్ జోరు కొనసాగాలి..** గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలంటే స్థానిక సంస్థల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీధిదీపాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. పొదలకూరు మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకునేలా ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కొనసాగాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థులు స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ జమీర్, ఆదాల మురళి, ఆశీర్వాదం తదితరులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నెల్లూరులో రమాదేవి రోడ్‌షోలకు విశేష స్పందన





- 19, 20, 21, 22 డివిజన్లలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం
- అభివృద్ధే విజయానికి బాటలు వేస్తుంది: పొంగూరు రమాదేవి
- నెల్లూరు అభివృద్ధిలో నారాయణది ప్రత్యేక ముద్ర: నుడా చైర్మన్ కోటంరెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థుల జోరు కొనసాగుతోంది. నగరంలోని 19, 20, 21, 22 డివిజన్లలో టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి నిర్వహించిన రోడ్‌షోలకు విశేష స్పందన లభించింది. కూటమి కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల సందడి నెలకొంది. సిటీ నియోజకవర్గంలోని ఆయా డివిజన్లలో టీడీపీ అభ్యర్థులు కర్తం ప్రతాప్‌రెడ్డి, గణేశం వెంకటేశ్వరరెడ్డి, గుణుకుల విజయలక్ష్మి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్‌లకు మద్దతుగా రమాదేవి ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల అపార్ట్‌మెంట్ వాసులు పసుపు చీరలు ధరించి ఆమెకు స్వాగతం పలికారు. గుమ్మడికాయతో దిష్టి తీసి, హారతులిచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ జెండాలు, కార్యకర్తల నినాదాలతో ప్రచార ప్రాంతాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. నెల్లూరు నగర ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. నగరంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారాయణపై ప్రజలు చూపిస్తున్న అభిమానం, ఆయన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయని ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని అన్ని డివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని కూడా కూటమి కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**నారాయణ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది** నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు నగర అభివృద్ధిలో మంత్రి నారాయణ ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నగర అభివృద్ధికి ఆయన అందించిన సేవలు ప్రత్యేకమని పేర్కొన్నారు. తన 42 ఏళ్ల రాజకీయ జీవితంలో నారాయణ వంటి రాజకీయవేత్తను చూడలేదని వ్యాఖ్యానించారు. నగర అభివృద్ధిలో నారాయణ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మంత్రి నారాయణ మద్దతుతో బరిలో ఉన్న కూటమి అభ్యర్థులను గెలిపించి, ఆ విజయాన్ని ఆయనకు కానుకగా అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోడ్‌షోలలో టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

# బేల్దార్ అవతారమెత్తిన మంత్రి నారాయణ కుమార్తె షరణి!





- ఆడంబరాలకు దూరంగా.. సామాన్యులతో మమేకమై ప్రచారం
- ఇటుకలు, కంకర మోస్తూ శ్రామికులతో అనుబంధం.. కార్యకర్తలకు ఆత్మీయ పలకరింపులు
- అభివృద్ధి ప్రణాళికలతో ఓటర్లను ఆకట్టుకుంటున్న షరణి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె షరణి తన వినూత్న ప్రచార శైలితో స్థానికుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. హోదా, ఆడంబరాలకు దూరంగా సామాన్యుల్లో ఒకరిగా కలిసిపోతూ, ఇంటింటి ప్రచారంతో ఓటర్లను పలకరిస్తున్నారు. ప్రచారంలో భాగంగా స్వయంగా ఇటుకలు, కంకర మోస్తూ బేల్దార్ అవతారమెత్తడం ద్వారా శ్రామిక వర్గం పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో చెరకు రసం తీసి, పైనాపిల్ కోసి పార్టీ కార్యకర్తలకు అందిస్తూ ఆత్మీయతను ప్రదర్శించారు. ఆమె ప్రచార శైలి కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. బుధవారం నగరంలో నిర్వహించిన ప్రచారంలో షరణి నెల్లూరు అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను ప్రజలకు వివరించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు 90 శాతం పూర్తయ్యాయని, రహదారుల నిర్మాణంతో పాటు నగరంలోని పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీఆర్‌సీ, డీఎస్‌ఆర్, ఆర్‌ఎస్‌ఆర్ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, ఆస్ట్రానమీ ల్యాబ్‌లు, హైడ్రోపోనిక్స్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావడం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం వంటి ప్రణాళికలను ప్రస్తావించారు. డిసెంబర్ 31 నాటికి సంగం బ్యారేజ్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. మంత్రి నారాయణ నేతృత్వంలో నగరంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నగరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా నెల్లూరు మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్‌తో పాటు 54వ డివిజన్ అభ్యర్థి అన్నంగి సమత, 55వ డివిజన్ అభ్యర్థి గండవరం విశాలాక్షి, 70వ డివిజన్ అభ్యర్థి రాచగిరి చంద్ర, ఇతర కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని షరణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సామాన్యులతో మమేకమవుతూ సాగిస్తున్న ప్రచారం నగర ఎన్నికల వాతావరణంలో చర్చనీయాంశంగా మారింది.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.